# దొంగా - మనిషీ

బళ్లారి ప్రాంతాన శ్రీధరగడ్డలో కరువు క్యాంపుకి ఛార్జీ ఆఫీసరుగా జాయినయింతరవాత ఇంతగా ఏనాడూ హైరానా పడలేదు జ్వాలాపతి. పొద్దు పొడిచింది లగాయతూ చీమల బారులా బస్తీనించీ, పల్లెటి దిక్కునించీ పాటకజనం మూటా ముల్లే నెత్తిన పెట్టుకుని పిల్లా మేకా తర్లించుకుని పొద్దు వాటారేదాకా ఎడతెరిపి లేకుండా వస్తూనే వున్నారు. డెల్టాలో ఏపుగా ఎదిగిన చేలూ, పచ్చని తోటలూ చూడమరిగిన కళ్ళకి ఇక్కడ నెరియలుపడ్డ నల్లరేగడి గడ్డిలో భూదేవి కటికిగుండె తగులుతుంది. దెబ్బతిన్న మదపుటేనుగుల్లా గాయపడి నెత్తురోడుతూ కనిపించే కొండల బారు అన్ని వేపులనించీ చూపుల్ని అటకాయిస్తాయి.

ఆ ప్రాంతాలలో వానపాటూ గట్టా సలక్షణంగా వున్న రోజులలోనే పంటలు అంతంత మాత్రం. ఇహను అతివృష్టిగాని, అనావృష్టిగాని సంభవించిందంటే, పైరుగాలి రవంత జంకిందంటే ప్రజలు కాలేకడుపులు చేతులతో పట్టుకుని అల్లాడుతూ వలసపోతారు. ఆయేడు మాగాణి పంటకి ప్రసిద్ధి పొందిన సిరిగుప్ప తాలూకాలోగూడా ఎకరానికి పందుం గింజలయినా రాలటానికి బ్రహ్మాప్రళయమయిపోయింది. గ్రాసంలేక పశువులు బక్కచిక్కిపోయాయి. పంటమీద వున్న చేలుగూడా తెంపిపోసిన మోళ్ళా అన్నట్టు చింకిపాతలతో తర్లిపోయే ప్రజానీకంతో సానుభూతిగా దిస్సమొలతో నిలిచిపోయాయి.

తను ఎంతమందికని ప్రవేశమియ్యగలడు? ఈ క్యాంపులో ఇంతమందికంటె ఎక్కువ జేర్చుకుందుకు వీలులేదన్న నియామకం వీళ్ళకేమి తెలుసు? క్యాంపులో ప్రవేశం దొరక్క నిలిచి పోయిన అన్నాతురుల సంఖ్య మితిమీరిపోతోంది. అక్కడికీ కొంతమందిని సుంకేశ్వరి క్యాంపుకి బదలాయించి సర్దుబాటు చేశాడు. ఎంత చేసినా దిగడిపోయిన అలగా జనమింకా వుండనే వున్నారు. సుంకేశ్వరిలో గూడా కూలీల సంఖ్య భర్తీ అయిందని వర్తమాన మొచ్చింది. ఇహ నేమిటి చేసేది? ఏమీ పాలుపోలేదు.

రాత్రి మాటుమణిగింది. నల్లకొండల చిక్కని చాయలు అంత కంటె చిక్కని చీకటిలో కలిసిపోయి, కరిగిపోతున్నాయి. రాళ్ళ కోరీల దగ్గర సమ్మెట దెబ్బలు వొకటీ ఆరా వినపడుతోనే

వున్నాయి. ఆవలి కొండ మలుపులో రోడ్డురోలరు వొదిలి కంకర రస్తా వేస్తున్న కూలీల జట్టు తిరుగుమొహం పట్టి పల్లెటి పదాలు పాడుకొంటో, బ్రతుకులో లేని ఆనందం పాటలో భర్తీ చేసుకొంటున్నారు. క్యాంపులోనించీ 'కిచెన్ సూపరెంటు' గావుకేకలు పెడుతున్నాడు. ఆ వేపుని గిలకల బావిలో బుంగల మునుగుతున్న చప్పుడు – బైట జల్లబండీలో కంకేళ్ళు కంచె మీద రాసుకుంటున్నాయి... ఎంతకీ నిద్రపట్టదు జ్వాలాపతికి. దానికితోడు కడుపులో కోలాహలంగా వున్నదతనికి. అక్కడి జనం ఇనపరేకుల్లాంటి జొన్నరొట్టెలు తిని ఇట్టే హరాయించుకోగలరు. తనూ, తన వర్కర్లూ తినే గజేంద్ర భోగాలూ, మదగజేంద్ర భోగాలూ ఢిల్లీ భోగాల క్రింద లెఖ్ఖకడతా రక్కడ. అవే వొంటబట్టించుకోలేకుండా వున్నాడు తను... అమ్మణ్ణి తల్లిదగ్గర మారాం చేస్తోంది... రెండు ఝాములవేళ గాఢంగా నిద్రపట్టిందతనికి.

ఉన్నట్టుండి హటాత్తుగా మెళుకువ వచ్చింది జ్వాలాపతికి. వంట యింటో అలికిడి యేదో నిశ్శబ్దాన్ని చీలుస్తోంది. భార్య అన్నపూర్ణ అమ్మణ్ణిని పక్కన వేసుకుని నిద్రపోతోంది కిటికీ దగ్గర. అవాళ పండగ. అంచేత హోళిగలు చేసుకున్నారు. చిత్రాన్నమూ, వడలూగట్టా వంటింటో వుద్దలంగా వున్నాయి. ఎలుకలుగాని ఏమయినా హంగామా చేస్తున్నాయేమో ననుకున్నాడు. కాని, పాత్రలూ, కంచాలూ, చెంబులూ, అతి పొందికగా తీస్తున్నట్టూ, వద్దన చేస్తున్నట్టూ అనిపించిందతనికి. తళుక్కున గుర్తుకొచ్చింది. వంట యింటో వెండిసామాను విపరీతంగా వున్నది. తన మునుగుడువుల కిచ్చిన కంచమొక్కటే నూటయిరవై తులాలు. ఎవడో జొరబడి ఇవన్నీ మాటగట్టుకుని పోతున్నాడా?... వీధి తలుపులు బార్లా తెరిచివున్నాయి... వంటింటో క్రీనీడ లేవో తచ్చాడుతున్నాయి... కొంప మునిగింది. కెవ్వున కేకలు వేస్తే? వీళ్ళ దగ్గిర వేటకత్తులుంటాయంటారు. మెడమీదకి విసిరి తుర్రుమంటే? చల్లగా గీరి భార్యని నిద్రలేపుదామని తోచింది. ఇహ నావిడ గుచ్చి గుచ్చి యక్షప్రశ్నలు వేస్తుంది గావును. సమాధానాలు చెప్పలేక చావాలి. ఈ సందట్లో చేజిక్కించుకున్న మూట కాస్తా చంకనెట్టుకుని కన్నపు దొంగ కాలికొద్దీ వుడాయించగలడు. ఏమీ పాలుపోక వొళ్ళంతా ముచ్చెమటలు పోసినై. నఖశిఖ పర్యంతమూ కంపం పుట్టుకొచ్చింది. ఏదో ఆవేశమొచ్చింది. చివ్వున లేచి వంటింటి తలుపు గభాల్నవేసి ఇవతల గొళ్ళెంపెట్టి 'దొంగ' 'దొంగ'ని కేక పెట్టాడు. దొంగ బోనులోపడ్డ బండీచిందువులా చిక్కడిపోయాడు. అమ్మణ్ణి అన్నపూర్ణని కావలించుకుని బావురుమని యేడుస్తోంది. జ్వాలాపతి అరుగుమీద నిలబడి ఇంటి కప్పెగిరిపోయేలా పొలికేకలు పెడుతున్నాడు. రంకెలు వేస్తున్నాడు దానితో ఇరుగు పొరుగిళ్ళ జనమంతా విరగబడ్డారు.

అంతాకూడా ఎవరైనా దొంగని పట్టుకుంటే విచిత్రంచూద్దామని చక్కావచ్చినవారే. అంతా వొకటిగా నిలబడితే దొంగ పట్టుబడితీరతాడని అందరికీ తెలుసు. కాని ఏవొక్కడూ కలిసిగాదని ప్రతి వొకడికీ గట్టినమ్మకం. జ్వాలాపతి వెర్రికేకలు పెట్టడం మినహా, దొంగ ఎక్కడున్నాడో చెప్పాలన్న సంగతికూడా మరచిపోయి వూరుకున్నాడు. అతన్ని అనీ లాభం లేదు. వొచ్చిన పెద్దమనుషులకైనా ఆరాలు అడగాలిసిన అవసరమున్నట్టు అసలు తట్టనేలేదు. ఆఖరికొక బుద్ధిమంతుడు అడగనే అడిగాడు. దొంగ ఎక్కడున్నాడో తెల్సుకుని అమాంతం వాటేసుకుందామని కాదుగాని దొంగ ఎటువేపునించీ వొచ్చి హటాత్తుగా దెబ్బ తీస్తాడో తెలుసుకుని తగుజాగర్తలో

వుండడమెందుకైనా మంచిదని. చివరికి దొంగ ఎక్కడ చిక్కడిందీ చప్పగా తేలిపోయింది. దానితో గొళ్ళెం పెట్టివున్న వంటయింటి దరిమేనా ఒక్కడు వెళ్లడు. అంతా పంచపాళీలో పోగై సమాలోచనలు ప్రారంభించారు. ఎంతతీవ్రంగా చర్చించినా గొళ్ళెం తియ్యాలసిన మొనగాడెవడో నిర్ధారణ కానేలేదు. కాని గొళ్ళెంతియ్యగానే ఎవరెవరు ఏమేమి చెయ్యాలో మాత్రం తనని మినహాయించుకుని ప్రతివొక్కడూ అతిచౌకగా సలహాలు పుంఖాను పుంఖంగా ఇచ్చేస్తున్నారు.

ఈ సందుచూచుకుని దొంగకాస్తా వంటింటి వెనకాతల సామాను గదిలోనించీ తను వేసుకున్న కన్నపుదారిగుండా తనే లక్షణంగా బయటపడి పెరటి తలుపులు తెరుచుకుని వీధిన పడ్డాడు. మరి నడివీధిని బరిమీద పడ్డ దొంగవల్ల ప్రమాదం తక్కువనిపించిదో యేమో అంతా బాణాకర్రలు వేసుకుని వెంటపడ్డారు.

దొంగ పట్టుబడ్డాడు.

క్షణంలో వాణ్ణి రెక్కలుపట్టుకుని ఇంటోకి బరబరా ఈడ్చుకొచ్చారు. దొరుకుతా మనిషో పశువోకూడ ఎవళ్లూ పట్టించుకోలేదు. చేతిలో ఏముంటే దానితోటి సత్తువకొద్దీ తలావొక దెబ్బతీశారు. కొంత మంది వుసికర్రలతో డొక్కల్లో దూసుకుపొయ్యేలా గుమ్మీపోట్లు పొడిచారు. మరికొంతమంది బడితలు తీసుకుని నెత్తిన ఠంగున మోగేలా చావమోదారు. కర్ర నొసలిమీదపడుతోందో కణతలమీదపడుతోందో తలపుర్రెమీద పడుతోందో ఎవడికీ గమనింపులేదు. సమయానికి చేతిలో ఏమీ లేకుండా రికామీగా వచ్చిన కొంతమంది ఆసామీలు తీరామూసి దొంగని కొట్టని వాళ్ళకింద లెఖ్ఖకొచ్చి పోతామేమోనని బెంగటిల్లిపోయి పక్కనున్న వాడిచేతిలో కర్రలాగి పుచ్చుకుని ఆమహాత్కార్యంలో తామూ వొకచెయ్యి వేశామనిపించుకొని తృప్తిపడ్డారు.

దొంగ ఎట్టాగూ దొరికాడు కదా అని ఇంటో ఏమున్నదో, ఏమి పోయిందో ఆరా చూచుకుంటున్నాడు జ్వాలాపతి. చంద్రహారమూ వంకీల జతా కనపట్టంలేదన్నది అన్నపూర్ణ. అవిగాని చేజిక్కించుకున్నాడేమోనని దొంగమొలలో నలుగురూ తడిమిచూచారు. కాని అవుపళ్ళేదు. “అప్పుడే ఎవడికైనా అందించేశాడేమో – వీళ్లెప్పుడూ వొంటరిగా కన్నం వెయ్యటానికి రారు” అన్నాడొక బుద్ధిమంతుడు. – అప్పుడే చేయిదాటి వూరుదాటి పోయివుంటాయికూడాను.” అని అలపరిచాడొక మోతుబరి. నగలు వెతకాలిసిన బాధ్యత నెత్తినించీ కిందికి దింపనందుకు అందరూ తేలికబడ్డారు. ఆ రగులుకున్న వుద్రేకంలో అందరికీ మళ్లీరోషం తిరగబెట్టింది. ఈసారి మరొక తట్టవరస దెబ్బలుపడగానే దొంగతాళలేక వంటింటోకి దూరాడు. జొరబడి గడమంచెదగ్గర మాంసపు ముద్దలా కుప్పగూలి నెత్తురు కక్కుకున్నాడు.

అన్నపూర్ణ నిదానంగా చూచింది. దొంగంటే రాక్షసిలా పెద్దపెద్ద కోరలూ గట్టా భీఖరంగా వుంటాడనుకుంది. పదిహేను పదహారేళ్ల పసివాడు! ప్రపంచంలో ఇంకా కళ్లయినా తెరవని కుర్రకుంక! వీడా దొంగ? నిలువునా నీరయిపోయింది అన్నపూర్ణ.

చచ్చినపాముని చంపడానికి అంతాపోగయ్యారు మళ్లీ. అన్నపూర్ణ అటకాయించింది.

“ఏమిటిదీ మనుషులు కాదూ మీరు – దున్నపోతుని బాదినట్టు బాదేస్తారా? కుర్రవాడు

చచ్చిపోతేనో" అని కేకలు పెట్టింది. ఆ వూహ స్విచ్చి నొక్కినట్టు అందరిలోనూ తళుక్కున మెరిసింది. "చచ్చిపోతాడేమో" అన్నదికాని ఆ యిల్లాలు, నిజంగా చచ్చేపోయినాడేమోనని బెరుకు పుట్టింది చాలామందికి. దానితో ఎర్రటోపీలూ, లాఠీకర్రలూ, పంచాయితీ రిపోర్టులు, శవపరీక్షలూ, జైలుకటకటాలూ, అండమానుదీవులూ స్ఫురణకొచ్చాయందరికీ. ఇహ క్రమంగా గుంపు పల్చబడింది.

అంతలో నగలు దొరికినయ్యంటే దొరికినయ్యన్నారు. జ్వాలాపతికి నెమరుకొచ్చింది. క్రితంరాత్రి "ఎందుకయినా మంచిది. రోజులు బావుండలేదు ట్రంకులో ఎంతభద్రంగా దాచినా పెట్టి పెట్టీ సరాసరి ఎవడైనా కాజెయ్యగలడు, అంత అజాగర్తగా పూజగదిలో దేవతార్చన పెట్టిలో తాళం లేకుండా పడేసి వుంచితే అక్కడ నగలుంటాయని నరమానవుడెవడికీ వూహకందదని" తను చెప్పిన వుపాయం జ్వాలాపతి మర్చిపోయాడు. పెనిమిటి చెప్పినమీదట నగలు తనచేత్తో తను స్థలం మార్చినసంగతి అన్నపూర్ణకీ గుర్తులేదు ఆ ఖంగారులో. అయితే దొంగ ఏమికాజేసినట్టు ఏమిదాటేసినట్టు? అన్నది సమస్య అయికూచుంది అందరికీ. ఏదో చోరీ చేసే వుంటాడు. అదిమాత్రం రూఢి.

అన్నపూర్ణ పడివున్న కుర్రవాణ్ణి జాలిగా వొడిలోకి తీసుకుని పైటకొంగుతో కణతలమీద నెత్తురు తుడుస్తో చెప్పింది - ఏమీపోలేదని. పళ్లెంలో చిత్రాన్నంమాత్రం తరిగింది. వెండిగిన్నెలో పరమాన్నం మచ్చుకైనా లేదు. తప్పేలాలో తోడుకుంటూ తోడుకుంటూవున్న గొడిగేదె పెరుగు సగానికి సగం మాయమయింది. వెండి అరిటాకులో అన్నం కలిపిన ఆనవాలు స్పష్టంగా అవుపిస్తోంది. అంతే. "కడుపునిండా అన్నం తిందామని వొచ్చినట్టున్నాడు అభాగ్యుడు - మధ్యస్తంలో మనం అల్లరిపెట్టాము. సగంతిని అర్ధాకలితో లేచిపోతున్న దరిద్రనాయణ్ణి అన్యాయంగా పట్టుకుని కొట్టేస్తున్నారూ మీరూ" అని కంటతడిపెట్టి గద్గదకంఠంతో ఆవేదన పడుతోంది అన్నపూర్ణ - అంతా తెల్లబోయారు. వాడు ఇంతాచేసి, ఆకలికి తట్టుకోలేక నాలుగు మెతుకులు కొరికి పోదామని ఇంట్లో జొరబడ్డ అనాథ అని తేలింది చివరికి. జ్వాలాపతి మనస్సు కరిగింది. ప్రమాదం గుర్తించాడు. ఏదో వొక పెద్ద గజదొంగని పట్టుకున్న ప్రతిష్ట నిష్కారణంగా నేలపాలై పోతున్నందుకు చాలామందికి ఆశాభంగం కలిగింది. అంత త్వరగా దొంగని మనిషిగా చూడాలిసిన అవసరమొస్తుందని ఎవ్వరూ అనుకోలేదు. ఏమి చేస్తారు. తప్పనిసరిగా అంతా గాయాలకి కట్టుగట్టే ప్రయత్నంలో పడ్డారు. కాని ఆకస్మికంగా పుట్టుకొచ్చిన దయారసాన్ని వెనక్కి నెట్టి ఒక భయం అందరినీ ఆవరించింది. ఇది ఖూనీ కేసు కింద తయారయితే! దానితో, అరివూస నా దగ్గిర పుష్కలంగా వుంది తీసుకొస్తానని వొకడూ - మంగలివీరన్న కట్లు గట్టడంలో మాంచి చెయ్యి - వాడి హస్తవాసి మంచిది - చిటికలో లాక్కొస్తా చూస్తూ వుండండని మరొకడూ, నా దగ్గిర మేలి రకం వాతరాక్షసముంది కాళ్లూ చేతులూ చల్లబడతయ్యేమో కనిపెడుతూ వుండండని ఇంకొకడూ ఇట్లా ప్రతి ఆసామీ మరొకణ్ణి వుండమని పురమాయించి అందరూ చల్లచల్లగా తలొకదారినీ ఇళ్లకి జారుకున్నారు. కడపటికి ఖంగారుపడుతో జ్వాలాపతీ, కన్నీళ్లతో అన్నపూర్ణ, కవురంపి రప్పించిన క్యాంపు డాక్టరు మిగిలారు. జ్వాలాపతి మణికట్టు పట్టుకుచూసాడు. నాడీ దొరకడంలేదు. అన్నపూర్ణ ముక్కుపుటాల దగ్గర వేలుపెట్టి చూచింది. వూపిరి సోకుతున్నట్టు

లేదు. డాక్టరుమాత్రం చకచకా ఆయొడిన్ రాసి సుచరింగ్‌నీడిల్‌తో కుట్టి గాజుపీసు యాక్రిప్లావిస్ లోషన్‌లో ముంచి పొడిదూది పైనవేసి బ్యాండేజి చేశాడు. తలకి కట్లు కట్టాడు. కాళ్లకి, చేతులకి... కాని వొళ్లంతా గాయపడినవాడికి ఎక్కడెక్కడ కట్లు కట్టాలో ఏమి తేలుతుంది.

పసివాడు కొంచెం తెప్పరిల్లి కదిలాడు. అన్నపూర్ణ, జ్వాలాపతీ చేతులు జోడించి పదేపదే డాక్టరికీ కనపడని దేవుడికీ దణ్ణాలు పెడుతున్నారు ఈ పాదిత్యం తమకి చుట్టుకోకుండా కాపాడమని. పసివాడిలో రవ్వంత కదలిక కనిపించింది. నీరసంగా "అమ్మ-అయ్య" - అంటూ వేలు చూపిస్తున్నా దేదిక్కుకో. జ్వాలాపతికి మసకమసగ్గా గుర్తుకొచ్చింది నిన్నరేత్రి ఖాళీలేదని తను తిప్పేసిన బడుగురైతు కుటుంబం తాలూకా ఈ పసివాడు? అతనికేమీ తోచలేదు. వాళ్ళు వూరిబైట మర్రిచెట్టుకింద మూటలు దింపుకుని వుసూరుమంటో దిక్కులుచూస్తో కూచోటం అతనెరుగును. వచ్చేటప్పుడు అతను చూచాడుకూడా. కాని, ఏమిటీ చేసేది?

ఏదో ప్రమాదం కమ్ముకొచ్చేస్తోంది. పసివాడి మొహాన్ని నల్లని చాయ ముసురేసినట్టు ఆవరిస్తోంది. అన్నపూర్ణ చేతనయిన వుపచారాలు చేసింది. జ్వాలాపతికూడా కన్న సంతానమయితే ఎంతగా తపనపడతాడో అంత ఆత్రమూ పడ్డాడు. కాని డాక్టరు పొరపడ్డాడు 'యాన్టిటిటనస్ ఇన్‌జక్షన్' యివ్వడం మరిచిపోయాడీ ఆందోళనలో. సమయానికి జ్ఞప్తికొచ్చినా ప్రయోజనం లేకపోను. ఆ ఇంజక్షన్ క్యాంపు ఆసుపత్రిలో లేదు. బస్తీకి ఇరవైమైళ్ల దూరం కబురుపెడితేనేగాని దొరకడం దుర్లభం - డాక్టరు పెదిమ విరిచాడు. పసివాడికి ధనుర్వాతం కమ్మే సూచనలు కనపడసాగాయి. కన్నతల్లీ తండ్రీ చప్పగా ఆరిపోని నిస్పృహ అంచులలో పట్టుకుని వేళ్లాడుతున్నారో యేమో ఆ పసివాడు పాపం దీనంగా వేలు ఆ దిక్కుగా చూపిస్తూనే వున్నాడు. అన్నపూర్ణకి అర్థమయింది, ప్రాణం హరీ అనే లోపుగా తల్లినీ, తండ్రినీ ఒక్కసారి కళ్లారా చూచుకుందామని తపనపడుతున్న ఆ పసిపాపడి లేతగుండె కళ్లకి కట్టిందామెకి.

వాళ్లుకూడా ఎన్ని రోజులనించీ తిండిలేక అలమటిస్తున్నారో ఆ చెట్టుకింద.

అన్నపూర్ణ గబగబా కసింత అన్నమూ వూరగాయీ మూటగట్టి, "ఏమయినాసరే కుర్రవాణ్ణి తలిదండ్రులచేతిలో పెట్టాలి - పెట్టితీరాలి - బండి తీసుకురండి" అని తొందరపెట్టింది. డాక్టరు కూడా "నిజమే అది మనం చెయ్యాలిసిన కనీస ధర్మం" అన్నాడు ముక్తసరిగా. జ్వాలాపతి అదిరిపడ్డాడు ఎట్లా? ఈ కాళరాత్రి వేళ మాట్లాడితే కరిచే ఈదరగాలిలో గడ్డకట్టుకుపోయిన చీకటి ఘడియల్లో - ఎక్కడ? ఎవరి కప్పగించేది? ఆ నిర్భాగ్యుడిని ఎట్లా చూచేది, ఏమని సమాధానం ఇచ్చేది? తనని క్షమిస్తారా వాళ్ళు? తను చేసిన అపచారం వాళ్ళకి మాత్రమేనా? అక్కడ ఆకలితో అల్లాడే దిక్కులేని పక్షలందరి మీదా తుపాకీ పేల్చాడా? వాళ్లందరి వుసురూ తనకి తగుల్తుందా? ఏమిటి పరిహారం దీనికి? జ్వాలాపతికి మెదట్లో రైళ్ళు పరిగెడుతున్నాయి.

"మీరు వచ్చినాసరే రాకపోయినాసరే నేనొక్కర్తెనీ కుర్రవాణ్ణి అప్పగించి వాళ్ల పాదాల దగ్గరపెట్టి వస్తాను. చంపింది చాలక చచ్చేముందైనా మన ధర్మం మనం నిర్వర్తించకపోతే భగవంతుడూరుకోడు. నిష్కారణంగా ఒక పసివాడి నిండుప్రాణాలు నిలువునా తీసింది చాలక వాణ్ణి చివరి ఘడియలలో అమ్మకీ అయ్యకీ దూరంచేసి అదనంగా పాపం కట్టుకోవాలని వున్నదా

మీకు? లేవండి ఆలోచించకండి"

అతనికింకా ఆలోచన తెమలలేదు.

"లేవండి - ఆలోచనలో పడకండి - ఒక్క క్షణం ఆలస్యంచేస్తే, ఈ రాత్రి, ఈ ఘడియ ఆజన్మాంతమూ కొరివిదెయ్యంలా వెంటాడి తీరుతుంది మనల్ని - అయ్యయ్యో - దొంగ దొరికాడన్న సంబరమేకాని, అంతా కలబడి కళ్లయదట వొక మనిషిని చంపేస్తుంటే చూచి వూరుకున్నాం నిష్కారణంగా - మనలో స్వార్థం ఇంత గూడుకట్టుకుపోయిందేమిటి? మనలో మానవత్వం ఇంతగా ఇంకిపోయిందా? దొంగా మనిషే - మనిషికి ప్రాణముంటుంది. కొడితే ప్రాణం పోతుంది అన్న జ్ఞానమే నశించి పోయిందేమిటి మనకి?" అని మొత్తుకుంది అన్నపూర్ణ.

కట్టేకట్టు కడుతూనే వున్నారు. కారే నెత్తురు కారుతోనే వుంది. బండి వచ్చింది. పదిలంగా కుర్రవాడిని బండిలో పడుకోబెట్టి బయలుదేరారు. డాక్టరు బండి వెనకాల నడుస్తున్నాడు. తోవలో ఎవ్వరూ మాట్లాడుకోలేదు.

దూరాన్ని మర్రిచెట్టు కిందనించీ హాహారావాలు వినిపిస్తున్నాయి. మసక చీకటివేళ అన్నం పట్టుకొస్తానని ఆవురుమంటూ బయలుదేరిన కుర్రకుంక ఇంకా రాలేదేమా అని గగ్గోలు పడుతున్న అభాగ్యుల ఆక్రందన స్పష్టంగా వినపడుతోంది.

బండి ఆగింది. వొణుకుతున్న చేతులలో పెట్టారు, గాయపడి కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆ చిన్న దేహాన్ని. డాక్టరు బ్యాటరీలైటు వేశి జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పాడు. ముసలి రైతు దంపతులిద్దరూ గొల్లుమన్నారు. ఆ బక్కచిక్కిన పాలికాపు కళ్ళల్లో దారిద్ర్యంచాత ఇంకిపోగా ఇంకిపోగా మిగిలిన ఏ నిప్పునెరుసో కణకణలాడి భగ్గుమంది. అన్నపూర్ణ క్షమించమని కాళ్ళమీద పడింది. జ్వాలాపతి నీరసంగా నిలుచుండిపోయాడు.

పాలికాపు శోకావేశంలో తనచేతి కందిచ్చిన మూట విప్పి అన్నమంతా వాళ్ళ మొహాన్ని ఝుల్లున కొట్టి కెవ్వున కేకపెట్టాడు పిచ్చివాలకంగా. డాక్టరు బ్యాటరీలైటు మీట వెనక్కి నెట్టాడు. చిమ్ముకుంటూ చీకటి కమ్మేసింది. జ్వాలాపతీ అన్నపూర్ణా బండి ఎక్కారు. బండి తిరుగు మొహం పట్టింది.

అటూ యిటూ మూగిన ఎత్తయిన నీలికొండలు ఆవులిస్తున్నాయి. చుక్కలన్నీ గుమికూడి చీకట్లు చీల్చుకుని తొంగితొంగి చూస్తున్నాయి. సూది మొనలాంటి ఆ కిరణాలు గుండెలలో, గుండెలలోతులలో అట్టడుగున తెట్టుగట్టిన పాపాన్నే భయంకరంగా కెలుకుతున్నాయి; కెక్కిరిస్తున్నాయి. ఇల కోడికూతలలోనించీ, తీతువుపిట్టల రెపరెపలలోంచీ మర్రివూడల జువ్వలో నించీ ప్రతిధ్వనులతో వచ్చే శాపాలలాంటి ఆ వాక్కులు శూలపుపోటులై చెవులలోనించీ, అంతరాంతరాలలోకి దూసుకుని ఎక్కడికో పోతున్నాయి.

ఇంటో పడగానే జలదరించే వేళ్ళతో అమ్మణ్ణిని గట్టిగా కావిలించుకుంది అన్నపూర్ణ.